




# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

ఆదివారం 7 జూన్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3







## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గౌరవం





**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో విశేష గౌరవాన్ని దక్కించుకుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మదితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి, పారిశుధ్యం, ఓటరు నమోదు తదితర అంశాలపై ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సూర్యాపేటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పట్టణంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఇటుకలను తయారు చేస్తూ, దీనిని నిరంతరం కొనసాగే ఒక స్థిరమైన వ్యవస్థగా మార్చడం శుభపరిణామమని కొనియాడారు. ప్రజల భాగస్వామ్యం, శానిటేషన్ (పారిశుధ్య) సిబ్బంది కష్టం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన అభినందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం అమల్లోకి వచ్చిందని కలెక్టర్ గుర్తుచేశారు. ఈ నిబంధనల ప్రకారం తడి చెత్త మరియు పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, వీటితో పాటు శానిటరీ వేస్ట్ కూడా వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా విభజించాలనే రూల్స్ వచ్చాయి. ఈ నియమాలను పక్కాగా అమలు చేయడంలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని, భవిష్యత్తులో పారిశుధ్య విభాగంలో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వార్డుల్లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ ప్రజలకు హామీ ఇచ్చారు. పట్టణంలో ఇబ్బందిగా మారిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) సమస్యపై ఆయన తీవ్రంగా స్పందించారు. సంబంధిత ఏజెన్సీ అధికారులను పిలిపించి, పనులు త్వరగా పూర్తి చేయాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని స్ట్రాంగ్ వార్నింగ్.ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక” కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన విద్య, వైద్యం, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను అధికారులు నేరుగా గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లోని ప్రజల వద్దకే తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను ముందుకుతీసుకెళ్లేందుకు యంత్రాంగం శ్రమిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందని, ప్రజలందరూ ఈ స్పెషల్ రివిజన్‌కు పూర్తి స్థాయిలో సహకరించి తమ పేర్లను నమోదు లేదా సవరణలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

**-మహిళల భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు..**

**'డయల్ 100'కు పిలిస్తే ఇంటికే పోలీస్**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎక్కడైనా మహిళల రక్షణకు ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. మహిళల వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వరుసగా నేరాలకు పాల్పడితే అలాంటి వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా ఉంచుతామని ఆయన హెచ్చరించారు. ప్రస్తుత సమాజంలో నేరాల సంఖ్య పెరుగుతుండటమే కాకుండా, వాటి స్వరూపం కూడా మారుతోందని ఎస్పీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మహిళలను ప్రత్యక్షంగానే కాకుండా, సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా వేధింపులకు గురిచేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సైబర్ వేధింపుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనేక సందర్భాల్లో మహిళలు బయటకు వచ్చి చెప్పుకోలేని, పోలీస్ స్టేషన్లకు వెళ్లడానికి సంకోచించే పరిస్థితులు ఉంటాయని ఎస్పీ అన్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం వినూత్న సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందని వెల్లడించారు.. మహిళలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా డయల్ 100లేదా 112నంబర్లకు కాల్ చేయవచ్చున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులే నేరుగా బాధితుల వద్దకు వచ్చి, అక్కడికక్కడే కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఒకవేళ పోలీసులు సకాలంలో స్పందించకపోతే, బాధితులు నేరుగా తన ఆఫీస్ కు వచ్చికలవాలని సూచించారు. సకాలంలో స్పందించని సిబ్బందిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళల రక్షణే ధ్యేయంగా సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం రెండు షీ టీమ్స్ ఒక భరోసా సెంటర్ నిరంతరం పనిచేస్తు న్నాయని ఎస్పీ తెలిపారు. ఎలాంటి అపోహలు లేకుండా, వివక్షకు లేదా వేధింపులకు గురైన మహిళలు భరోసా కేంద్రాన్ని ఆశ్రయించి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతూ, నేరస్థులకు కఠినంగా శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇంట్లో అత్తమామలు లేదా భర్త చేతిలో గృహ హింసకు, ఇబ్బందులకు గురయ్యే మహిళలు సఖి సెంటర్లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జిల్లాకు రెండు సఖి సెంటర్లను మంజూరు చేశారని ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సఖి కేంద్రాల్లో వచ్చే ఫిర్యాదులపై డీఎస్పీ పర్యవేక్షణలో, నైపుణ్యం కలిగిన మహిళా కౌన్సిలర్ల ద్వారా భార్యాభర్తలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. కౌన్సిలింగ్ తర్వాత కూడా ప్రవర్తన మార్చుకోని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ షఫీ ఉల్లా, ఏసీపి ప్రసన్నకుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్ రావు, వార్డ్ కౌన్సిలర్ షేక్ జహీర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి డాక్టర్ అమూల్య, మున్సిపల్ కిరణ్ కుమార్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## ఫీజులు ఇవ్వకుంటే తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది

భానుపురి/సూర్యాపేట



ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోతే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని బీసీ హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సూర్యాపేటజిల్లా కేంద్రంలో ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కొరకు సంక్షేమశీ కొరకు బడ్జెట్లో 2500 కోట్ల రూపాయల ప్రత్యేక నిధి కేటాయించాలని అలాగే బీసీ సబ్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని లేనిపక్షంలో తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరి బీసీ సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చి నిధుల వినియోగానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలని పేద విద్యార్థులకు విద్య కు దూరం కాకుండా ఉండేందుకు పెండింగ్ ఫీజు ఇవ్వాలని బీసీలకు సంబంధించిన సబుచిత ప్రాధాన్యత దక్కడం లేదని బీసీల ఆర్థిక , విద్య,,రాజకీయం సాధికారతకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని బీసీ యువతకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పనకు ప్రత్యేక విధానాలు రూపొందించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నవల వెంకన్న ఈట దాసు ఎం రవి కే పరశురాం ఎల్ వెంకన్న నాగరాజు సైదులు లక్ష్మయ్య బ్రహ్మం నరసయ్య ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం

భానుపురి/సూర్యాపేట ప్రతినిధి






ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చివేంల మండలం గుంజులూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు.గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు . రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.బడిబాట కార్యక్రమము విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు , అంతర్గత రహదారుల నిర్మాణం, త్రాగునీరు ఎర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ శిరీష, డిపిఓ యాదగిరి, డిఐఇఓ సులోచన రాణీ, తహసీల్దార్ చంద్ర శేఖర్, ఎంపీడీవో సంతోష్ సర్పంచ్ సైదులు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూల లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు

భానుపురి/సూర్యాపేట టౌన్




జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది శనివారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు అని ఎస్పై తెలిపారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన, గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో పట్టణ కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, జాతీయ రహదారి వెంట హోటల్స్ దాబాలు, పాన్ డబ్బాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నాఅలాంటి వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు.



# జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి





భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను అదేశించారు. శనివారం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ బి హరి సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరయ్యారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన వడ్లు వెనువెంటనే లారీల్లో మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా చూడాలని సూచించారు. జిల్లాల్లోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4 గంటల లోపల హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ కి చేరుకునే విధంగా చూడాలని సూచించారు. మహిళలకు మార్గమధ్యలో భోజనాలు, తాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈఓ శిరీష, డిఆర్డిఓ సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, డీఎవో శ్రీధర్ రెడ్డి, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎంహెచ్ఓ వెంకట రమణ, ఆర్డిఓ వేణుమాధవ్, డీఈవో అశోక్, డిఐఇఓ సులోచన రాణి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యాద కిరణ్ కుమార్ ప్రమాణ స్వీకారం









భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యాద కిరణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని బాలాజీ గ్రాండ్ బంకెట్ హాలులో ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాద కిరణ్ కుమార్ మాట్లాడుతూ సంస్థ మార్గదర్శకాలను అమలు పరుస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధిం చేందుకృషి చేస్తానని, సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా నడిపిస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ మధన్ మోహన్ రెపాల, కీనోట్ స్పీకర్ తీగల మోహన్ రావ్, వీడిజి -1 కోడె సతీష్ కుమార్, వీడిజి-2 గుడిపుడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి చీకూరి కృష్ణ, కోశాధికారి మిర్యాల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ సభ్యులు కొండా సంతోష్, త్రివేణి హరి,రాచర్ల కమలాకర్ ,తోట శ్యాంప్రసాద్, హనుమత రావు,బడుగుల శ్రీనివాసు,తదితరులు పాల్గొన్నారు.

# కర్మకాండ భవన్ కు శివ సాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీస్ సహకారం



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేటలో కర్మకాండ భవన్ నిమిత్తం శివ సాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీస్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ శ్రీనివాస్ గుప్తా 25 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందిస్తానని తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శివ సాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీస్ లో ఇటీవల నూతనంగా ఎన్నికైన సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు భెలిదే శ్రీనివాసులు ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో మా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఆర్యవైశ్యుల ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల్లో భాగంగానేను సైతం మీకు తోడ్పాటు గా ఉంటానని ప్రకటించి వారి తరపునుంచి ఉద్యోగ అవకాశాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వ్యాపారస్తులకు అండగా వుంటాను

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాదితో కలిసి ఎఐ సిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారస్తులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. కుల సంఘాల విషయంలో , అసోసియేషన్ ల ఎన్నికల విషయంలో తాను ఎప్పుడూ జోక్యం చేసుకోనని అన్నారు. వివిధ సంఘాలకు ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఇష్టప్రకారం ఓటు వేసి గెలిపించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం గెలుస్తుందని ఆయన అన్నారు.. పట్టణంలో ఎవరైనా వ్యాపారస్తులను బెదిరిస్తే తాను సహించబోనని అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యాపారాలు స్వేచ్ఛగా చేసుకునే విధంగా సూర్యాపేటలో ప్రశాంతమైన వాతావరణం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. తమకు గతంలో కేటాయించిన స్థలం గురించి ఆర్యవైశ్య సంఘం నాయకులు అడిగినప్పుడు గతంలో మంత్రిగా పనిచేసిన జగదీశ్ రెడ్డి అనేక కుల సంఘాలకు స్థలాలు ఇస్తున్నట్లు శంకుస్థాపన చేశారని, కానీ అవేవీ ప్రభుత్వ రికార్డులో నమోదు కాలేదని ఆయన అన్నారు. ప్రభుత్వ రికార్డులలో నమోదయితే తప్పకుండా సహాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్, నాయకులు బిక్కుమళ్ల కృష్ణ, జూలకంటి నాగరాజు, సుమన్ వెంకన్న, మిట్టపల్లి రమేష్, బోనగిరి కృష్ణ, డోగుపర్తి ప్రవీణ్, కుంచపర్తి రాజశేఖర్, సోమ ప్రవీణ్, రాచర్ల సత్యం, బెలిదె శ్రీనాథ్, కంది బండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో సామాన్యులకు ఇల్లు కట్టుకునే స్వేచ్ఛ లేదా..?





భానుపురి/సూర్యాపేట టౌన్

అన్ని అనుమతులతో ఇల్లు కట్టుకుంటుంటే పలువురు కోర్టులో కేసు ఉందని ఇల్లు ఎలా కడతారంటూ రాజకీయ ఒత్తిడితో అధికారుల ద్వారా ఇబ్బందుల పాలు చేస్తున్నారని సామాన్యులకు సూర్యాపేటలో ఇల్లు కట్టుకునే స్వేచ్ఛ లేదని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 19వ వార్డుకు చెందిన దొంతగాని వసంత వెంకన్న రోధించారు. శనివారం వారు నూతనంగా నిర్మిస్తున్న ఇంటిముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 1980 నుంచి హక్కుదారులుగా ఉన్న యానాల మల్లారెడ్డి, అమృతా రెడ్డి, సురకంటి విజయమ్మలు అన్న చెల్లెళ్ళు 800 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారని అన్నారు. సురకంటి విజయమ్మ కుమారుడు భీమర్జున్ రెడ్డి నుంచి దారోజు జానకి రాములు 2020లో 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. ఆ 400 గజాల స్థలంలో నుంచి దొంతగాని వసంత వెంకన్నలమైన మేము 160 గజాలు కొనుగోలు చేశామని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఆ స్థలానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని మున్సిపాలిటీకి టాక్సు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. తాము కొనుగోలు చేసిన స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నించగా ఆ స్థలం కోర్టులో ఉందని ఇంటి అనుమతికి అధికారులు నిరాకరించారన్నారు. తమకు స్థలాన్ని విక్రయించిన వారు న్యాయపరంగా వెళ్లి 2025లో కోర్టు కేసును డిస్మిస్ చేయగా తాము ఇంటి అనుమతి తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కొందరు ఈ స్థలం కోర్టు కేసులో ఉందని అనుమతులు ఎలా ఇస్తారంటూ రాజకీయ ఒత్తిడితో అధికారులను ఇబ్బంది పెడుతుండగా వారు తమను ఇల్లు కట్టకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఈ స్థలంపై కోర్టులో కేసు వేసిన వారు ఎవరనేది తమకు తెలియదని వారు ఇదంతా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. నిరుపేదలమైన మేము పైసా పైసా పోగు చేసి స్థలాన్ని కొనుక్కొని ఇల్లు కట్టుకుంటున్నామని తమన ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సమంజసం అన్నారు. కోర్టులో కేసు వేసిన వారు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్ తీసుకొని వస్తే న్యాయ పోరాటానికైనా తాము సిద్ధమని అన్నారు. ఈ స్థలంపై కోర్టులో కేసు వేసిన వారు కనీసం కోర్టుకు ఏ ఒక్కనాడు కూడా హాజరు కాలేదని దీంతో వారు ఎవరు ఎందుకు ఇదంతా చేస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. ఉన్నత అధికారులు స్పందించి రాజకీయ వత్తిళ్లను నివారించి నిజానిజాలు నిగ్గు తేల్చి నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట సురకంటి భీమార్జున్ రెడ్డి, దారోజు భాగ్యరాజ్, సురకంటి విజయమ్మ, దొంతగాని వెంకన్న తదితరులు ఉన్నారు.

# సిబ్బంది కృషితోనే పర్యావరణ అవార్డు



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు రావడం వెనుక పారిశుద్య కార్మికులు, సిబ్బంది, అదికారుల కృషి ఉందని మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు . శనివారం ఆమె మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతిరోజు ప్రజల వద్ద నుంచి సేకరణ చేసే చెత్తను బాలెంల డంపింగ్ యార్డ్ కి చేరవేసిన తర్వాత అక్కడ వ్యర్థాలను వేరుచేసి అక్కడ నుండి జమున నగర్ కేంద్రానికి తరలించి అక్కడ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కవర్ల నుంచి మ్యాట్ లు, బ్రిక్స్, టైల్స్, యోగ మ్యాట్స్ వంటి ఉత్పత్తులను తయారుచేసి ఆ ఉత్పత్తులను అమ్మడం జరుగుతుందని వాటి ద్వారా మున్సిపాలిటీ ఆదాయం కూడా వస్తుందని ఆమె చెప్పారు. మున్సిపల్ కమీషనర్ హన్మమంతరెడ్డి మాట్లాడుతూ చెత్తను తగలబెట్టకుండా ప్లాస్టిక్ నుంచి ఉత్పత్తులు తయారు చేయడం వెనుక చాలా శ్రమ ఉందని మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య విభాగం మరియు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయడం వల్ల ఇది సాధ్యమవుతుందని అన్నారు. చెత్త ను వేరుచేసి మున్సిపాలిటీ కి అందజేస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షఫి వుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ కౌన్సిలర్లు నాగుల వాసు, బండారు వెంకన్న పాల్గొన్నారు.

# వైరస్ సోకిన వీధి కుక్కలకు ప్రత్యేక చికిత్సలు ప్రారంభం





భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణంలో మెంజ్ వైరస్ సోకి చర్మవ్యాధులతో బాధపడుతున్న వీధి కుక్కల చికిత్సకు లిబ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకులు అక్కినేని అమల ప్రత్యేక చర్యలు చేపట్టారు . ఇటీవల వీధి కుక్కల చర్మవ్యాధులు, ప్రజల్లో నెలకొన్న ఆందోళనపై స్పందించిన బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ షెల్టర్ డైరెక్టర్, సి.ఎఫ్.ఓ ఎన్.ఎస్.కె కుమారి బ్లూ క్రాస్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల ఆదేశాల మేరకు వైరస్ సోకిన కుక్కలకు వైద్య చికిత్సలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలో ఇప్పటివరకు 194 వైరస్ సోకిన కుక్కలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వాటి చికిత్స కోసం సుమారు రూ.1.80 లక్షల విలువైన ఇంజెక్షన్లు, మందులను అమల గారు హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు పంపించారు. జిల్లా బ్లూ క్రాస్ వాలంటీర్ , కాంగ్రెస్ నాయకుడు నరేందర్ నాయుడు గురువారం ఈ మందులను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌కు చెందిన బ్లూ క్రాస్ వాలంటీర్లు లాలు, నరేష్ ప్రత్యేక వైద్య బృందంతో కలిసి కుక్కలకు చికిత్సలు అందించేందుకు సూర్యాపేటకు చేరుకున్నారు. శనివారం నుంచి పట్టణంలోని 48 వార్డులలో వైరస్ సోకిన కుక్కలను గుర్తించి దశలవారీగా వైద్య చికిత్సలు అందించనున్నట్లు నరేందర్ నాయుడు తెలిపారు. ఇటీవల బ్లూ క్రాస్ బృందం ప్రత్యేక వలల సహాయంతో చర్మవ్యాధులతో బాధపడుతున్న కుక్కలను పట్టుకుని వాటి రక్త నమూనాలను సేకరించిన విషయం తెలిసిందే. నమూనాల పరీక్షా ఫలితాల ఆధారంగా తదుపరి కార్యాచరణ చేపడతామని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం బాధిత కుక్కలకు అవసరమైన వ్యాక్సిన్లు, మందులు అందజేస్తూ చికిత్స కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వీధి కుక్కలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని, జంతు జనన నియంత్రణ కార్యక్రమాలు, రేబిస్ నిరోధక టీకాలు, వైద్య చికిత్సల ద్వారానే సమస్యను సమర్థవంతంగా నియంత్రించవచ్చని బ్లూ క్రాస్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమానికి సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదీ, కమిషనర్ సి.హెచ్. హన్మంతరెడ్డి,వైస్ ఛైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, వార్డు కౌన్సిలర్లు కోడి శిరీష శివ , స్థానిక కాంగ్రెస్ నేతలు గుంటి సైదులు, అక్కినపల్లి జానయ్య , యాట వెంకన్న, పొలాగాని కృష్ణల సహకారం అందిస్తున్నారని నరేందర్ నాయుడు తెలిపారు. బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ షెల్టర్ డైరెక్టర్ ఎన్.ఎస్.కె కుమారి పర్యవేక్షణలో ఈ ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగనున్నట్లు వెల్లడించారు.

# వట్టే జానయ్య అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం



భానుపురి/సూర్యాపేట టౌన్

శుక్రవారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు బుడుగు బలహీన వర్గాల పక్షాన ఉండి వజ్రా టౌన్ షిప్ లోని భూమి అక్రమ రిజిస్ట్రేషన్ అడ్డుకునేందుకు వచ్చిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు వత్తాసు పలికే విధంగా పోలీసులు వ్యవహరించారని, ఇది ముమ్మాటికీ కుట్ర పూరితంగా జరిగిందని ఆరోపించారు. పోలీసులు నిజానిజాలు తెలుసుకొని భాదితులకు న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీల కుట్రలను టి ఆర్ పి ఎల్లప్పుడు ఎండగడుతూనే ఉంటుందని, భాదితుల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టి ఆర్ పి పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, సూర్యాపేట మండల అధ్యక్షుడు సోమ గాని లింగస్వామి గౌడ్, కుంభ వెంకన్న, నేలచర్ల మధు ప్రజాపతి, బోడపట్ల మధు గౌడ్, చింతకాయల జానయ్య, మామిడి శోభన్ గౌడ్, కాంటేకార్ రఘుమోహన్, వట్టే లింగరాజు, వట్యాల శేఖర్, చాంప్లా, సాయి, గుంటూరు విజయ్, రాగం లింగయ్య, మంద లింగరాజు, తదితరులు పాల్గొన్నారు

# భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డికి తీవ్ర అస్వస్థత

-నిమ్స్ లో చికిత్స పొందుతున్న నర్సింహారెడ్డి

-పరామర్శించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




భానుపురి/యాదాద్రి భువనగిరి

భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యం కారణంగా గత 20 రోజుల నుండి నిమ్స్ దవాఖానలో డైరెక్టర్ డా.బీరప్ప పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న కొమ్మిడి నర్సింహారెడ్డిని శుక్రవారం మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురి అయ్యారు. నర్సింహారెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందనే విషయం తెలుసుకున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కొమ్మిడి నర్సింహారెడ్డిని పరామర్శించి నిమ్స్ డాక్టర్లతో పాటు కుటుంబ సభ్యులతో చర్చించారు.

# ఘనంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు





భానుపురి/యాదాద్రి భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయం వద్ద శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఉదయం నుంచే అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలను ఉత్సాహభరితంగా జరిపారు. జన్మదిన సందర్భంగా బీర్ల అయిలయ్య ఉదయం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు పోందారు. తర్వాత యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో భాగంగా, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు బీర్ల అయిలయ్యకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులకు నిత్యావసర ఆహార సరుకులను పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర, ఆలేరు నియోజకవర్గం, నలుమూలల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు అట్టహాసంగా కొనసాగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ క్రేన్ గజమాలతో బీర్ల అయిలయ్య ను ఘనంగా సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.అదేవిధంగా విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేసి వారి విద్యాభివృద్ధికి తన సహకారాన్ని తెలియజేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు బీర్ల నిలయం వద్ద అభిమానులు, ప్రజలు, కార్యకర్తల రాకపోకలతో ప్రాంతం జనసంద్రంగా మారింది. జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య వైభవంగా సాగాయి.ఈ



కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ మండలాల సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోచంపల్లి చేనేతలకు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉంది



-పోచంపల్లి థ్రెడ్ ఎగ్జిబిషన్ సందర్శించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

-మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



భానుపురి/యాదాద్రి భువనగిరి

పోచంపల్లి చేనేత కళ కు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని భారీ నీటి పారుదల, సివిల్ సప్లై మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రెండవ రోజు శనివారం హైటెక్స్ లో ఏర్పాటు చేసిన థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ కు మంత్రి విచ్చేసి ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్ ను మంత్రి సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో హైదరాబాద్లోని హైటెక్స్లో జూన్ 7 వరకు నిర్వహిస్తున్నారని మంత్రి అన్నారు.చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదాపూర్ హైటెక్స్ లో "పోచంపల్లి Thread 'ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాల్ లోని స్టాల్స్ అన్నింటిని ఆయన సందర్శించి, వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో పోచంపల్లి శాలువలను ఢిల్లీలో సహచర ఎంపీలు , కేంద్ర మంత్రులకు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించే వాడినని ఆయన తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశానని ఈ సందర్భంగా వివరించారు. చేనేత వస్త్రాలను ధరించి , మన సాంస్కృతి , సంప్రదాయన్నీ కాపాడుకోవాలని ఆయన తెలిపారు. హైటెక్స్ లో జరిగే వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని సందర్శించి, నాణ్యత కలిగిన వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్, లో సంబధిత అధికారులు పాల్గొన్నారు.

# భీమలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

-భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి

భానుపురి/యాదాద్రి భువనగిరి



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామ సమీపంలోని భీమలింగంను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం సందర్శించారు. భీమలింగేశ్వ ర స్వామి దేవాలయం నిర్మాణం కోసం ఇప్పటికే 2 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని, దేవాలయం నిర్మాణం, సమీపంలో బ్రిడ్జి నిర్మాణం 50 కోట్లు ఆ ప్రాంతం అభివృద్ధి చేసుకోవటానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరిస్తా అని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. భీమలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం అధికారులు ప్రణాళికాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మూసి ప్రక్షాళన చేసి , ఆలయ నిర్మాణం కూడా పూర్తి చేస్తామని, అన్నారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రం గా తీర్చి దిద్దుతామని అంతకు మునుపు స్థానిక నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. భీమలింగం కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టూ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో R&B, ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు,ఆర్కిటెక్ట్ మరియు ఇతర సిబ్బంది, మండల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.